# ఇరువదినాలుగవ ప్రసంగము

శ్రీప్రకాశానందులవారు గోండలులో ఉన్నపుడు జూనాగఢ్ నుండి ప్రొఫెసర్ మహాదేవమల్లార్ జోశీ వారిదర్శనమునకు వచ్చిరి. ఆయన స్వామివారిని జూనాగఢ్ దయచేయమని ప్రార్థించిరి. కొద్ది రోజుల తరువాత వచ్చెదనని స్వామివారు చెప్పిరి. పీఠడియా మార్గమధ్యమున ఉన్నది. అక్కడ దిగి శ్రీనిత్యానందస్వామివారి దర్శనము చేసికొని వచ్చెదమని సెలవిచ్చిరి. ఇది విని ప్రొఫెసరు గారు ఇట్లనిరి :— నేనుకూడ వారిపేరు వింటిని. కాని దర్శనము మాత్రము చేయలేదు. నేనుకూడ అక్కడకివచ్చి అచ్చటినుండి తమను తీసికొని జూనాగఢ్ వెళ్ళెదను. మూడురోజుల తరువాత స్వామి శ్రీప్రకాశానందులవారు, ఉదయశంకరవకీలు, దయాశంకరభాయి ముగ్వురును ఉదయపురైలుబండిలో పీఠడియా వెళ్లిరి. ఆసమయమున శ్రీనిత్యానందస్వామివారి ఆశ్రమద్వారమునకు బయట తాళము వేసియుండెను. కావున అచ్చటిమనుష్యుడు తాళముచెవి తీసికొని వచ్చుటకు వెళ్ళెను. శ్రీస్వామివారును, ఉదయశంకరవకీలును అచ్చటి అరుగుపై కూర్చొనిరి. ఆసమయమున శ్రీస్వామివారు చెప్పిరి.

భాగవతమునందు చెప్పబడినది.

*గృహస్థస్య క్రియాత్యాగో వ్రతత్యాగో వటోరపి ।*
*తపస్వినో గ్రామసేవా భిక్షోరింద్రియలోలతా ॥*

గృహస్థుడు కర్మను త్యజించినను, బ్రహ్మచారి బ్రహ్మచర్య వ్రతమును త్యజించినను, వానప్రస్థుడు గ్రామములయందు నివసించినను, సన్యాసి విషయాసక్తుడైనను,

*ఆశ్రమాపసదా హ్యేతే ఖల్వాశ్రమవిడమ్బకాః ।*
*దేవమాయావిమూఢాంస్తాన్ ఉపేక్షేతానుకమ్పయా ॥*

అట్టివారు ఆశ్రమాడంబరమును చేయువారును, ఆశ్రమవాసులలో అధములును అగుదురు. జ్ఞానియగు పురుషుడు ఈశ్వరమాయా నిమగ్నులయిన అట్టివారిని ఉపేక్షా భావముతో చూచును.

నేను ఇంకను ఇంద్రియలోలుడనే. కావుననే స్వామివారు నాయెడ ఉపేక్షాభావము వహించి నాకు దర్శనము ఇచ్చుటలేదు.

**ఉదయశం:—** తమరు ఇట్లు చెప్పుచున్నారేమి? నిత్య, నైమిత్తికాది ఐహికకర్మలను నేను ఆచరించుటలేదు. పైవాక్యములు నాకు సంబంధించును.

స్వా. ప్ర. :— ఇప్పటి బ్రాహ్మణులు శిలోంఛవృత్త్యాది సాధనములు లేనందున రోజంతయు వ్యావహారికజీవితమున గడపవలసివచ్చుచున్నది. ఇక నిత్య, నైమిత్తికాది ఐహికకర్మములు ఎట్లు ఆచరించగలరు? సన్యాసులనే ప్రమత్తులుగా పేర్కొనవలెను. ఇంతలో ఆశ్రమద్వారము తెరువబడెను. స్వాములు ఇరువురును ఒకరి నొకరు కుశలప్రశ్నలు వేసిరి. స్వామి ప్రకాశానందులవారు తమతో కూడ వచ్చినవ్యక్తులను శ్రీనిత్యానందస్వామివారికి ఎరుకపరచిరి.

సాయంకాలము నాలుగుగంటలకు అందరును టీ తీసికొని కూర్చొనిరి. ఆసమయమున ఉదయశంకరవకీలు నిత్యానందులవారిని ప్రశ్నించెను.

"నేను చాలకాలమునుండి సంధ్యావందనాది నిత్యకర్మములను ఆచరించుచున్నాను. అయినను అంతఃకరణము శుద్ధినొందుట లేదు. ఇందుకు కారణమేమి?

## జీవితనిర్వహణసాధనమునకును అంతఃకరణమునకును గల సంబంధము.

స్వా. ని. :— మీరేమి చేయుచున్నారు?

ఉదయ :— వకీలు వృత్తిని.

## రాజసప్రకృతులు పది రకములు.

స్వా. ని. :— పూర్వకాలము వకీలువృత్తి లేదు. రాజసస్వభావములు రాజనీతిప్రకరణమున పదిరకములుగా చెప్పబడినవి.

1. పురోహితుడు (వేదోక్త కర్మములను ఆచరింపజేయువాడు) 2. ప్రతినిధి, 3. ప్రధాని, 4. సచివుడు, 5. మంత్రి, 6. పండితుడు, (రాజునకు చెప్పదగిన రహస్యములను చెప్పువాడు) 7. ప్రాడ్వివాకుడు,(న్యాయాధిపతి) 8. అమాత్యుడు, (ప్రధానికిసహాయపడువాడు అనగా ఉపప్రధాని) 9. సుమంత్రుడు, 10. దూత, సుదూత, పరమ సుదూత అని.

వీనియందు వకీలువృత్తి చెప్పబడలేదు. పూర్వము విద్యాభ్యాసము చేయు అలవాటు ఉండుటచే వకీలు అవసరము లేకుండెను. ఈ రోజులలో విద్యాభ్యాసము తగ్గి రైతులు మొదలగు బీదవారికిని, రాజులకును, రాజోద్యోగులకును కల సంబంధములు హీనముగా నుండుటచే ప్రజలు భయభ్రాంతులును, అజ్ఞానులును అయిపోయిరి. కావున అధికారి సామాన్యజనుని కార్యవశమున ఏదైన ప్రశ్న అడిగినచో తగిన సమాధానము చెప్పలేకపోవుచున్నాడు. భయపెట్టి అడిగినచో మాట్లాడడుకూడను. ఈవిధముగ నేరములు మొదలగువానిని నిర్ణయించుటలో యథార్థము తెలిసికొనుట కష్టము. అట్టివారి యథార్థవిషయములను న్యాయాధికారికి తెలుపుటకు ప్రయత్నించు వ్యక్తులు నేటి వకీళ్ళు. ఈవృత్తియందుకూడ వారి పరిశ్రమకు తగిన ప్రతిఫలము తీసికొనుట ధర్మము. అంతేకాని న్యాయశాస్త్రపు ఆడంబరముతో నిజమును అబద్ధముగా ఋజువుచేసి ఇష్టమువచ్చిన డబ్బు గుంజుకొనుట వృత్తికాదు. ఈకాలమునందలి వకీలువృత్తిలో ఈతప్పుపనులు తప్పనిసరిగా జరుగుచున్నవి. మీజీవనోపాయము పరిశుద్ధముగా నుండదు. శుద్ధమగు జీవనోపాయము లేనందున అంతఃకరణము పరిశుద్ధముగా నుండదు.

వృత్తినిగురించి మనుస్మృతియందు కొన్ని శ్లోకములు గలవు. అవి నాకు కంఠస్థము కావు. మనుస్మృతి తెరచి వాటిని వివరించిరి.

*అద్రోహేణైవ భూతానామల్పద్రోహేణ వా పునః।*
*యా వృత్తిస్తాం సమాస్థాయ విప్రో జీవేదనాపది॥*

"బ్రాహ్మణుడు ఆపత్కాలమున ఏప్రాణికిని ద్రోహము చేయని వృత్తిని అవలంబించవలెను. అది వీలుకానిచో వీలైనంత తక్కువద్రోహము కలుగునదియే ఆచరించవలెను. అట్టి వృత్తితో జీవితము గడుపుకొనవలెను.

*యాత్రామాత్రప్రసిద్ధ్యర్థం స్వైః కర్మభిరగర్హితైః।*
*అక్లేశేన శరీరస్య కుర్వీత ధనసంచయమ్॥*

"తన ప్రాణరక్షణముకొరకు నింద్యముకాని కర్మలను ఆచరించి, శరీరమును బాధించకుండ ధనమును సంపాదించవలెను."

*ఋతామృతాభ్యాం జీవేత్తు మృతేన ప్రమృతేన వా।*
*సత్యానృతాభ్యామపి వా న శ్వావృత్త్యా కదాచన॥*

"జీవితము అంతటను ఋతము, అమృతము, మృతము, ప్రమృతము, సత్యము, అనృతము వీనిని దృష్టిలోనుంచుకొని జీవితము గడపవలెను. కాని కుక్కవలె జీవితము గడపరాదు."

*ఋతముఞ్ఛశిలం జ్ఞేయం అమృతం స్యాదయాచితమ్।*
*మృతం తు యాచితం భైక్షం ప్రమృతం కర్షణం స్మృతమ్॥*

ఉంఛము, శిలము అని ఋతము రెండు రకములు. ఉంఛవృత్తితో జీవితమును నిర్వహించుకొనదలచినచో ఎవరికిని హాని కలుగని విధముగ త్రోవలోను, పొలములోను మిగిలినధాన్యమును ఒక్కొక్కగింజచొప్పున ఏరుకొని వానిని ఉపయోగించుకొనవలెను. ఇది సర్వశ్రేష్ఠమగు వృత్తి.

## రెండవరకపు వృత్తి.

శిలవృత్తి అనగా ధాన్యపు వెన్నులను సంపాదించి గింజలను పోగుచేయుట. ఈవృత్తి రెండవతరగతికి చెందినది.

ఈ రెండువృత్తులయందును కపటమునకు తావు లేదు. ఈ రెండువృత్తులను 'ఋతము' అని చెప్పెదరు. ఋతమనగా సత్యము. అడుగనిదే శ్రద్ధాసక్తులు కలవారు ఇచ్చినది 'అమృతము.' ఇదికూడ ఉత్తమమైన వృత్తియే. భిక్షాటనము చేసి కొంచెము కొంచెము సంపాదించుట 'మృతము' అనబడును. ఇది సాధారణమైన వృత్తి. ఏలనన, అందు అడుగుకొనవలసియున్నది. వ్యవసాయము చేసి జీవితమును గడుపుకొనుట 'ప్రమృతవృత్తి'. అందు చాల పరిశ్రమచేయవలసివచ్చును. బ్రాహ్మణజీవితమునకు లక్ష్యములయిన అధ్యయనాధ్యాపనములకు అంతరాయము కలుగును.

సత్యానృతం తు వాణిజ్యం తేన చైవాపి జీవ్యతే ।
సేవా శ్వవృత్తిరాఖ్యాతా తస్మాత్తాం పరివర్జయేత్ ॥

వ్యాపారముచేసి జీవితము గడుపుకొనుట 'సత్యానృత' వృత్తి అనబడును. నౌకరీ చేసి జీవితము గడపుకొనుట శ్వవృత్తి. కావున ఆ శ్వవృత్తిని త్యజించవలెను. ఆపద్ధర్మముగా జీవితమును గడపుకొనుటకు వాణిజ్యమును గ్రహించవచ్చును.

**ఉదయ:—** తమరు సెలవిచ్చినట్లు పూర్వము జనులు శిలోంఛవృత్తులతో జీవితము గడిపెడివారు. కాని కాలక్రమమున ఆవృత్తులు పోయినవి. పూర్వకాలమున మనుష్యులు తక్కువ, పంటలు ఎక్కువ. రైతులు కొంతభాగముమాత్రమే పంటచేలనుండి తీసికొని వెళ్ళెడివారు. మిగిలినది చేనులోనే విడచెడివారు. జనులు ఆపంటనుండి శిలోంఛవృత్తులద్వారా తమ జీవితమునకు కావలసిన ఆహారధాన్యములను సంపాదించెడివారు. ఇప్పుడు భారతదేశపు జనాభా పెరిగిపోయి

నది. ఆహారధాన్యములు ఆప్రకారము పండుటలేదు. కావున శిల ఉంఛ వృత్తులతో ప్రస్తుతము జీవితము గడపుకొనుట అసంభవము. కాలధర్మవశమున జనులు ఏదోరీతిని పొట్టపోషించుకొనవలసివచ్చుచున్నది. డబ్బు సంపాదించుటకు వేరువేరు వృత్తులు చేయవలసివచ్చుచున్నది. వకీలువృత్తితో అబద్ధములాడి సంపాదించినచో జీవితము శుద్ధమైనదికాదని నాకు తెలియును. కాని ఏమి చేయుదును? ఈవృత్తిని విడిచిపెట్టలేనుకదా! అయినను నాకు తెలిసినంతవరకు అసత్యపు కేసులు తీసికొనుటలేదు. పొరబాటున అబద్ధపుకేసు తీసికొనినచో తెలిసినవెంటనే వారిడబ్బు వాపసు ఇచ్చి కేసు విడచిపెట్టుచున్నాను. తప్పుడుదోవను డబ్బు సంపాదించినచో ఆఫలితము నేను అనుభవించవలసివచ్చును అని నేను ఎరుగుదును.

## చేసినది అనుభవించవలెను.

స్వా. ప్ర. :—ఏకః పాపాని కురుతే ఫలం భుఙ్క్తే మహాజనః।
భోక్తారో విప్రముచ్యన్తే కర్తా దోషేణ లిప్యతే॥

"పాపము ఒకడు చేయును. దాని ఫలమును అందరు అనుభవించెదరు. అనుభవించినవారు పాపమునుండి తప్పించుకొనెదరు. కాని చేసినవాడుమాత్రము ఆదోషమునుండి తప్పించుకొనలేడు."

వాల్మీకిఋషి బ్రాహ్మణకుటుంబమున జన్మించియుండెను. కాని బాల్యమునుండియు భిల్లుని ఇంట పెరిగెను. భిల్లులే తల్లిదండ్రులనుకొనెడివాడు. ఆతడు భిల్లవృత్తినే అవలంబించెను. కుటుంబపోషణమునకు భిల్లులవలె దారిలో పోవు బాటసారులను కొట్టుచుండెను. ఆమార్గము భయంకరమైనదని తెలిసికొని ఎవరును ఆదారిని వెళ్ళెడివారు కారు.

కాని దైవేచ్ఛచే సప్తమహర్షులు ఆదారిని వచ్చిరి. వాల్మీకి వారిని "వస్త్రములు, పాత్రలు ఇవ్వండి, లేనిచో చంపివేయుదు"నని చెప్పెను.

ఋషులు:—మాకు చచ్చిపోయెదమనికాని, మావస్త్రాదులు నీవు తీసికొనెదవనికాని భయము లేదు. మాకు అహంకార, మమ కారములు కలుగవు. నీవు చంపిన చచ్చువారము కామని మాకు తెలియును. ఏలనన చచ్చుట శరీరకార్యము. కాని నీవు ఇంత మహా పాపము చేయుచున్నావుకదా! దానిని అనుభవించువారు మరియొకరు కలరా? నీవు పాపము కుటుంబముకొరకు చేయుచున్నావు. కావున నీ కుటుంబమునందలి జనులవద్దకు వెళ్ళి వారు ఈపాపము పంచుకొనెద రేమో అడుగుము.

వాల్మీకి:—మీరు తప్పించుకొనుటకు ఈయుక్తివన్నుచున్నారు.

ఋషులు:—దోచెదవను భయము మాకు లేదు. మేము నీకు కలుగు పాపభారమునందు దయకలిగి చెప్పితిమి. నీవు ఇంటికి వెళ్ళి అడిగి రమ్ము. మేము ఇక్కడే నిలబడియుండెదమని ప్రమాణము చేయుచున్నాము.

వాల్మీకికి పూర్వజన్మసంస్కారము స్ఫురించి వారిమాటలు నచ్చినవి. అతడు ఇంటికివెళ్లి భార్యాబిడ్డలు పాపమును పంచుకొనెద రేమో తెలిసికొనెను.

వారు చెప్పిరి. "చేసినవాడు అనుభవించవలెను. మాకేమి? మమ్ము పోషించుట నీకర్తవ్యము. నీవు ఏవిధముగనైన సంపాదించుము. ఆపాపమునందలి భాగముతో మాకేమి సంబంధము?"

ఈవిధముగా ఇంటిలోనివారు అందరును పాపమును పంచుకొనుటకు అంగీకరించలేదు. తన పాపమునకు భాగస్థుడు మరియొకడు లేడనుసంగతి వాల్మీకి తెలిసికొనెను. అకార్యములను ఆచరించుటయందు విరక్తి కలిగెను. అతడు మహర్షుల చరణములయందు పడినవాడై వారి సదుపదేశమును తెలిసికొని పూర్ణయోగ్యతను పొందెను. జగమునకు అపూర్వ ఆదర్శమును చూపించెను.

**ఉదయ:**—శుద్ధమగు వృత్తితప్ప అంతఃకరణశుద్ధికొరకు మరి యొక సాధనము ఏదైన కలదా?

**నిష్కామకర్మచేకూడ అంతఃకరణము శుద్ధిని పొందును.**

స్వా. ని. :— నిష్కామభావముతో కర్మచేయుటచేకూడ అంతఃకరణము శుద్ధిపొందును.

నిష్కామకర్మ అనగా కర్తవ్యదృష్టితో ఫలేచ్ఛలేకుండ భగవత్ప్రీతికొరకు మాత్రము కర్మచేయుట. అనగా మనోవాక్కాయములతో చేయు కర్మ.

*యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।*
*యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్॥* గీత. 9 అ.

"నీవు ఏమి చేసినను, ఏమి తినినను, ఏవి హోమముచేసినను, ఏది దానముచేసినను, ఏతపము చేసినను అంతయును నాకు అర్పించుము."

ఇంతలో ప్రొఫెసరు జోషీ జూనాగఢ్‌నుండి ఇద్దరు విద్యార్థులతో వచ్చిరి. శ్రీప్రకాశానందులవారు శ్రీనిత్యానందులవారికి ప్రొఫెసరుగారిని పరిచయముచేసిరి. అప్పుడు ప్రొఫెసరుగారు నిత్యానందులవారితో పలికిరి. "తమపేరు చాలకాలమునుండి వినుచున్నాను. స్వామిప్రకాశానందులవారు ఇక్కడికి వచ్చిరి. వారికొరకు నేను ఇచ్చటకు వచ్చుటతో తమదర్శనము లభించినది. ప్రొఫెసరుతో వచ్చిన ఇద్దరు విద్యార్థులలోను ఒకరు బి. ఏ. లో చదువుచుండిరి. మరియొకరు ఇంటరులో చదువుచుండిరి. వారిలో రెండవ విద్యార్థి శ్రీనిత్యానందులవారిని అడిగెను.

పూర్వము బ్రహ్మచర్యాశ్రమమునందు బ్రాహ్మణులు వేదాధ్యయనము మొదలగునవి చేయుచుండిరి. ఇప్పుడు అవేమియు లేవు. సంధ్యావందనాది నిత్యకర్మములు కూడ చేయుటలేదు, నేను ఏమి చేయవలెను?

## ఆరు నిత్యకర్మలవలనను కలుగు ఫలము.

స్వా. ని. :—నీవు కాలానుగుణముగా హూణవిద్య నభ్యసించుచున్నావు. అందుచే నీవు చేయవలసిన షట్కర్మలను యథావిధిగా చేయ వీలులేకపోవచ్చును. అయినను లఘుసంధ్యాదులను చేయవచ్చును. విద్యాభ్యాసము ముగిసినపిమ్మట షట్కర్మలను సమగ్రముగా యథావిధిగా చేయుటచే పాపవిముక్తుడ వగుదువు.

*సంధ్యా స్నానం జపశ్చైవ దేవతానాం చ పూజనమ్।*
*వైశ్వదేవం తథాతిథ్యం షట్ కర్మాణి దినే దినే॥*

"స్నానము, సంధ్య, జపము, దేవతార్చన, వైశ్వదేవము, అతిథిసత్కారము ఇవి ప్రతిరోజును చేయవలెను."

స్నానము:— స్నానసంధ్యాదులను ఈశ్వరప్రీత్యర్థము నియమానుసారము చేసినచో అంతఃకరణశుద్ధిద్వారా పరమాత్మని యందు భక్తియు, ఆత్మజ్ఞానమును పొందుయోగ్యతయు కలుగును. అనేకవిధములగు ఈసకామకర్మలచే సంసారబంధమునందు చిక్కువడిన నరునకు నిష్కామకర్మచేతనే విముక్తి కలుగును.

కావున సంధ్యావందనాదికములు తప్పక ఆచరించవలెనని వేదము విధించుచున్నది. సంధ్య చేసినచో చేయవచ్చును కాని స్నానము చేయవలసిన అవసరము ఏమని అడుగవచ్చును. నిద్రయందు శరీరము మాలిన్యమును పొందును. శరీరము సహజముగా మలినమైనది. అనేకఛిద్రములు కల శరీరము రాత్రింబవళ్ళు స్రవించుచునే యుండును. ఆమలినమునుండి శరీరమును పరిశుద్ధము చేయునది ప్రాతఃకాల స్నానమే. కావుననే భగవానుడును, దేవతలును స్నానమును పొగడిరి. స్నానముచే ఉత్సాహము, తృప్తి, చిత్తశాంతి, బలవృద్ధి, కాంతి, శరీరపుష్టి, సౌభాగ్యము, ఆయుర్వృద్ధి మొదలగు గుణములు కలుగునని పరాశరాది ఋషులు ధర్మశాస్త్రములయందు చెప్పుచున్నారు.

సంధ్య:— ఋషులు చిరకాలము సంధ్యావందనముతోపాటు జపముచేసి దీర్ఘాయువును పొందిరి. బుద్ధి, యశము, కీర్తి, అధ్యయనము మొదలగువానికి వనికివచ్చు బ్రహ్మతేజమునుపొందిరి. ఆయువు మొదలగునవి కోరువారు చాలకాలము సంధ్యావందనము చేయవలెను. ద్విజుడు, అందులోను బ్రాహ్మణుడు సంధ్యావందనము చేయనిచో బ్రతికియున్నప్పుడు శూద్రునితో సమానము. చనిపోయినతరువాత ఆతనికి కుక్క-జన్మము కలుగును. సంధ్యను ఆచరించని మానవుడు అపవిత్రుడు. ఆతనికి కర్మాధికారము లేదు. సంధ్యావందనమును విడనాడి మరి ఏకర్మమును చేసినను దాని ఫలితము లభించదు. సంధ్యావందనము, గాయత్రీజపము చేయని బ్రాహ్మణుడు శూద్రుని కంటె హీనుడు. గాయత్రీతత్త్వమును తెలిసికొనిన బ్రాహ్మణుడు లోకపూజ్యతను పొందును. కావున సంధ్యావందనము, గాయత్రీ జపము తప్పక చేయవలెను.

దేవతార్చన:— జపాదులతరువాత దేవతార్చన చేయవలెను. పంచదేవతాస్వరూపమున అందరి దేవతలను పూజించవలెను. జలము, అగ్ని, హృదయము, సూర్యుడు, వేదిక– వీనికితోడు పాషాణప్రతిమల నుంచి, ఈశ్వరబుద్ధితో పూజించవలెను. సూర్యాది నవగ్రహములు, గ్రామదేవతలు మున్నగువారు అందరిచే పూజింపబడుదురు.

వైశ్వదేవము:— ద్విజులు గృహ్యసూత్రోక్తవిధిని వైశ్వదేవమును ఆచరించవలెను. హోమముచేయదగిన వస్తువు లభించనప్పుడు కాచినపాలుకాని, లేక పండ్లు, పూవులు, తేతగడ్డి ఏది దొరకిన దానితో విధివిహితముగ హోమము చేయవలెను. వైశ్వదేవము చేయనిదే భోజనముచేయువారు నరకమును పొందెదరు అని పరాశరులు తన ధర్మశాస్త్రమున చెప్పిరి. అందుచే ఉప్పువేసిన కూరలు

మొదలగునవి తప్ప మిగిలిన హవ్యాన్నములను (నేయి, పెరుగు మొదలగునవి) అగ్నియందు హోమము చేయవలెను.

కణ్డనీ పేషణీ చుల్లీ ఉదకుమ్భీ చ మార్జనీ,
పఞ్చ సూనా గృహస్థస్య తాభిః స్వర్గం న గచ్ఛతి॥

గృహస్థుని ఇంటియందు సన్నికల్లు, తిరుగలి, పొయ్యి, కుండ, చీపురుకట్ట ఉపయోగింపబడుటచే జీవహింస జరుగును. ఈ ఐదువిధములగు హింసలనుండియు నివృత్తిని పొందించుటకు వైదికధర్మమునందు బ్రహ్మయజ్ఞము, పితృయజ్ఞము, దేవయజ్ఞము, భూతయజ్ఞము, మనుష్యయజ్ఞము అను ఐదు యజ్ఞములు విధించబడినవి.

## అతిథిసత్కారము.

భోజనసమయమున మనము ఎప్పుడును చూచియుండని, గోత్ర శాఖాదులు తెలియని, ఆచారవిద్యాదులుకూడ ఎరుగని రాత్రిమాత్రము ఉండు వ్యక్తి అతిథి. తిథి అనగా ఒకరోజు. ఒకరోజుకంటె ఎక్కువకాలముఉండనివాడు అతిథి. ఒకగ్రామములో విచిత్రములగు హాస్యకథాదులను ప్రదర్శించియు, సంగీతముద్వారాను జీవితము గడపుకొనువాడు ఉన్నాడనుకొనుడు. ఆతనికి భార్య, ఇంట అగ్ని అన్నియు ఉండును. ఆతడు వేరొక ఇంటికి భోజనమునకు వచ్చిన అతిథిగా పరిగణించబడడు. పరగ్రామమునందు నివసించుచు వైశ్వదేవ సమయమున అనగా భోజనసమయమున వచ్చినచో ఆతడు అతిథి అనబడును. ఆమంత్రణముచే వచ్చువాడు అతిథి కాడు.

మనుస్మృతియందు చెప్పబడినది.

చౌరో వా యది చాణ్డాలో శత్రుర్వా పితృఘాతకః॥
వైశ్వదేవే తు సంప్రాప్తే సోఽతిథిః స్వర్గసమ్మతః॥

"దొంగకాని చండాలుడుకాని శత్రువుగాని, పితృహత్య చేసినవాడుగాని ఎవ్వడైనను వైశ్వదేవము చేయుచుండగా వచ్చినచో నతడు అతిథిగా పరిగణింపబడును."

"మిత్రుడైనను, శత్రువైనను, మూర్ఖుడైనను, పండితుడైనను, వైశ్యదేవబలికి చివరభాగమున వచ్చిన అనగా భోజనసమయమున వచ్చిన ఆతడు అతిథి అని అందరు అంగీకరించిరి. గృహస్థు బీదవాడయి అన్నాదులు లేకపోయినను భూమి, నీరు, మధురమగు పల్కులు లేని సజ్జనగృహము ఉండదు. "అతిథి విష్ణుస్వరూపుడు. తరింపజేయుటకు వచ్చును." అని తలచి భక్తితో ఆతనిని భోజనమునకు లెమ్మని ప్రార్థించవలెను. ఏ ఇంటినుండి అతిథి నిరాశతో వెళ్ళునో ఆగృహస్థునకు అతడు తనపాపమును ఇచ్చి ఆతని పుణ్యమును తీసికొని వెళ్ళిపోవును.

తుకారాము తన అభంగునందు వ్రాసెను.

"మన ఇంటిలో దేవపూజ చేయుచుండగా ఎవరైన అతిథి వచ్చి కూర్చొనినచో ఆతనిని మొదట సత్కరించవలెను. అట్లు చేయకుండ దేవపూజ చేయుట చాల అధర్మము. ఈఅపరాధము చేయువ్యక్తి దేవతలపై చందన, పుష్పాదులు వేసినను, అవి వేయుచు మంత్రములు చదివినను అవి అన్నియును భగవానునితలపై రాతితో కొట్టినట్లు అగును. నీయింటికి వచ్చిన అతిథిని అగౌరవముచేసి దేవుని ఎదుట పిండివంటలపళ్ళెము నుంచుటయా? మనస్సునందు అట్టి భేదభావమును ఉంచి దేవపూజ చేయకుము. లేనిచో ద్వైతమును కొట్టుటచేవచ్చు పాపమును నీవే భరించవలసివచ్చును."

## సంధ్యావందనవిధి.

షట్కర్మములను ఆచరించలేకపోయినచో సంధ్యనైనను చేయవలెను. మనుస్మృతి మొదలగునవి ద్వికాలసంధ్యను విధించినవి. గృహ్యసూత్రములు, మధ్యాహ్నసంధ్యకూడ విధించుచున్నవి. కావున త్రికాలసంధ్యావిధి వచ్చినది. స్మృత్యనుసారము సంధ్యను ఆచరించుటకు వీలుపడనిచో శ్రుతిని అనుసరించి లఘుసంధ్య అనగా

సూర్యోపస్థానము, అర్ఘ్యము, జపము మాత్రము చేయవలెను. త్రికాలములయందును సంధ్యాసమయమున చేయవలసిన గాయత్రి మూడు అష్టోత్తరశతములు అర్థచింతనముతోపాటు ఉదయముకాని ఉదయసాయంత్రములయందుకాని పూర్తిచేయవలెను. అందు తనకు వీలగు మార్గమును అవలంబించవలెను.

విద్యార్థి:—ఈమాత్రము ఇటుపైన చేయుదును.

స్వా. వ్రి. :—(నవ్వుచు) ఒక బ్రాహ్మణకుమారుడు విదేశములకు వెళ్ళి బారిష్టరు అయివచ్చెను. విదేశమునుండి వచ్చిన తరువాత తండ్రి కుమారుని సంధ్యావందనము చేయుమని చెప్పెను. "నేను సంధ్యావందనము చేయనా? ప్లీడరీ చేయనా?" అని అతడు ప్రశ్నించెను. మరేమియు చేయలేకపోయినను బ్రాహ్మణుడవయినందున గాయత్రి ఒకమాల (అష్టోత్తరశతము) అయిన చేయుము అని తండ్రి చెప్పెను. తరువాతిరోజున బారిష్టరు మాలతీసికొని గాయత్రిని ఉచ్చరించి ఒకపూసను త్రిప్పెను. అనంతరము "డిటో, డిటో" అని 107 పూసలను త్రిప్పెను. మాల త్వరగా పూర్తిఅగుట గమనించిన తండ్రి ఇదేమని ప్రశ్నించెను. బారిష్టరు సమాధానము చెప్పెను. "ఒకమారు మంత్రము చదివి మిగిలిన 107 సార్లు డిటో, డిటో అంటిని." అని చెప్పెను. (ఇది విని అందరు నవ్విరి)

ఇట్లు శ్రద్ధలేకుండ ఏమిచేసినను అర్థములేదు. ఏమిచేసినను శ్రద్ధతో చేయవలెను.

## సదాచారము ఆవశ్యకము.

దానితోబాటు సదాచారముకూడ ఆవశ్యకమే. బ్రహ్మచర్యాశ్రమమునందు మీరు సదాచారముతో సంచరించుట తప్పనిసరి. తైత్తిరీయోపనిషత్తునందు చెప్పబడినది. "సత్యం వద, ధర్మం చర, స్వాధ్యాయాన్మా ప్రమదః"

"సత్యము పలుకుము, ధర్మముగా సంచరించుము. స్వాధ్యాయమునందు పొరబాటు రానీయకుము."

"మాతృదేవో భవ, పితృదేవో భవ ఆచార్యదేవోభవ" అనికూడ చెప్పబడినది.

నారదభక్తిసూత్రములయందు ఉన్నది.

"త్రయః పురుషస్య గురవో భవన్తి, మాతా, పితా, ఆచార్యశ్చ"

"నరునకు తల్లి, తండ్రి, ఆచార్యులు అనువారు ముగ్గురు ను గురువులు."

తల్లియగు కౌసల్య, తండ్రి దశరథుడు, గురువగు వశిష్ఠుడు కలసి కూర్చొనియున్నప్పుడు రామచంద్రుడు మొదట కౌసల్యా మాతకు నమస్కరించెను. తరువాత దశరథునకు నమస్కరించెను. అనంతరము వశిష్ఠునకు నమస్కరించెను. ఇది సదాచారము. సదాచారమును అనుసరించనివాని ఆచరణకును పశువుయొక్క ఆచరణమునకును భేదమేమి? ఏలనన పశువులుకూడ పెద్దవయిన తరువాత తమ తల్లిదండ్రులను మరచిపోవును. ఒక్కొక్కప్పుడు తమతల్లిదండ్రులతోనే యుద్ధము చేయును.

ప్రత్యహం ప్రత్యవేక్షేత నరశ్చరితమాత్మనః।
కిన్ను మే పశుభిస్తుల్యం కిన్ను సత్పురుషైరితి॥

"మానవుడు ప్రతిరోజు తన నడవడికను పరిశీలించుకొనుచుండవలెను. నా నడవడిక పశువుతో సమానముగా నున్నదా? సత్పురుషులతో సమానముగా నున్నదా అని పరీక్షించుకొనవలెను."

తైత్తిరీయోపనిషత్తునందు చెప్పబడినది.

యాన్యనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని నో ఇతరాణి।
యాన్యస్మాకం సుచరితాని తాని త్వయోపాస్యాని నో ఇతరాణి॥

"నిందారహితములగు కర్మములనే ఆచరించవలెను. ఇతరకర్మములను కూడదు. మా మంచినడవడులను నీవు ఆచరించవలెను. వానికి వ్యతిరేకములయినవాటిని ఆచరించరాదు." అని ఆచార్యులు శిష్యునికి ఉపదేశించిరి.

స్వా. ని. :—భక్తిసూత్రములయందు నారదుడు చెప్పెను.

*"'అహింసాసత్యశౌచదయాస్తిక్యాదిచారిత్ర్యాణి పరిపాలనీయాని"*

అహింస, సత్యము, శౌచము, దయ, ఆస్తికత్వము, చరిత్రము వీనిని సర్వవిధములను రక్షించుకొనవలెను.

## అ హిం సా స్వ రూ ప ము

*సర్వేషామేవ భూతానామక్లేశజననం హి యత్।*
*అహింసా కథితా సద్భిర్యోగసిద్ధిప్రదాయినీ॥*

ఏ ప్రాణికిని మనస్సు, వాక్కు, కాయము వీనిచే దుఃఖము కలిగించకుండుట అహింస అని సత్పురుషులు చెప్పిరి. ఈవిధమగు అహింసనే నారదుడు దైవభక్తికి విధించెను. దైవభక్తికి బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి అను నలుగురు ఆశ్రమవాసులును తగుదురు. సంసారవ్యవహారములను అన్నిటిని త్యజించి కేవలము ఈశ్వరపరాయణత్వముతో, విరక్తిభావముతో నుండుట అహింసాస్వరూప మనియును, అది మహావ్రతమనియును యోగదర్శనమున వర్ణించబడినది.

*"ఏతే జాతి దేశకాలసమయానవచ్ఛిన్నాః, సార్వభౌమా మహావ్రతమ్"*

అహింస, సత్యము, అస్తేయము, అపరిగ్రహము, బ్రహ్మచర్యము ఇవి యమము అను శబ్దముతో వ్యవహరించబడును. ఇవి ఎల్లజాతులయందును, ఎల్లదేశములయందును ఎల్లకాలములయందును, సర్వావస్థలయందును స్థిరముగానున్నచో మహావ్రతము అని చెప్పబడును.

బ్రాహ్మణత్వాదిజాతులు, తీర్థాదిప్రదేశములు, చతుర్దశ్యాది కాలములు బ్రాహ్మణప్రయోజనాదిసమయములు (ప్రసంగములు) ఈనాలుగు రకములగు పరిచ్ఛేదములు లేకుండ, చిత్తముయొక్క క్షిప్తాది సర్వావస్థలయందును ఈ యమాదులను పాటించుట మహావ్రతము.

"బ్రాహ్మణుని చంపరాదు" అను విధియొక్క భావము ప్రయోజనమును అనుసరించి ఇతరుని చంపవచ్చును అనుకొనబడును. ఇట్టి విధి జాతి పరిచ్ఛేదముకల విధి. "ఫలానా తీర్థస్థలమునందు హింసచేయరాదు." అనిన ఇతరస్థలములయందు ప్రయోజనాపేక్షతో హింసకు వీలుకలుగును. చతుర్దశీదివసమున హింసించరాదు అనునియమము మిగిలినరోజులలో హింసనుసమర్థించును. ఇట్టి నియమములు జాతి, దేశ, కాల పరిచ్ఛేదముతో కూడిన నియమములు. అటులనే బ్రాహ్మణప్రయోజనాదులు లేకుండ హింసచేయరాదు అను విధికి భావము బ్రాహ్మణప్రయోజనము ననుసరించి హింసచేయవచ్చునని అగును.

ఈనాలుగువిధములగు పరిచ్ఛేదములు లేని హింస— అనగా ఏజాతిని, ఏప్రదేశమునందును, ఏకాలమునందును, ఏప్రసంగమునందును హింసించకుండుట మహావ్రతము.

## హింస

భక్తి కలిగియున్నను గృహస్థాశ్రమమునందు వ్యవహారమున్నులగువారు ఈవిధమగు అహింసను పాలించుట దుష్కరము. అపరాధిని దండించుటయు, సజ్జనుని సత్కరించుటయును ధర్మనీతియొక్క తత్త్వము అగుటచే రాజులు, రాజపురుషులుకూడ ఎల్లకాలములయందు దండించవలసిన అవసరములు ఏర్పడును. ఇతరులను కూడ దండించుటకు ఈక్రిందిశ్లోకము సంకేతము నిచ్చుచున్నది.

"నఖినాం దంష్ట్రిణాం చైవ శృఙ్గిణామాతతాయినామ్,
హస్త్యశ్వానాం తథాన్యేషాం వధే హన్తా న దోషభాక్॥"

గోళ్ళతోగాని, దంతములతోగాని, కొమ్ములతోకాని మనుష్యులను చంపు పెద్దపులి, ఎలుగుబంటి మొదలగునవి; మదించి పిచ్చెత్తిన ఏనుగులు, గుర్రములు, మనుష్యులు మొదలగు ప్రాణులు; దుర్మార్గులు అగు మనుష్యులు వీరిని వధించినచో వధించురాజు దోషమును పొందడు. మిగిలిన ఏ ప్రాణినికూడ డబ్బుకొరకు కాని, రుచికొరకుకాని చంపరాదు

1. ఇంటికి కాని; అడవిలోనున్న పశువులు మొదలగునవి తినుటకు ఉపయోగించు గడ్డికి గాని, ఇంట్లోకాని, పొలములోకాని నిలవచేసియున్న ధాన్యము గడ్డి మొదలగువానికిగాని నిప్పుఅంటించువాడును;2. ఎవనినైన చంపుటకు విషము నిచ్చువాడును; 3. ఇతరుని చంపుటకు శస్త్రమును ధరించువాడును; 4. పరధనమును అపహరించినవాడును; 5. అన్యాయముగా ఇతరుల క్షేత్రములను అపహరించినవాడును; 6. స్త్రీలను అపహరించినవాడును- ఈ ఆరురకముల జనులును ఆతతాయిలు అనబడుదురు.

వీరిని వధించవచ్చును. ఈశ్లోకమునందు చెప్పబడిన వధ, లోకరక్షార్థమే అని గ్రహించవలెను. ధర్మతత్త్వమును తెలిసికొనకుండ జైనులువలె పురుగులను పెంచుటమాత్రము అహింస కాదు. ఆవును చంపబోవు పులిని చంపి ఆవును రక్షించుట నిజమగు ధర్మము. కాని హింసాభయముచే ఆవును పులి నోటినుండి రక్షించకుండుట ధర్మము కాదు. అంతే కాదు, అట్లు చేయువాడు దోషి. దొంగలు మొదలగు దుర్మార్గులను దండించుట ప్రజారక్షణార్థము ధర్మము. దండభయము లేనిదే ఏమనుష్యుడును నీతితో సంచరించడు. అపరాధము చేయనివానిని దండించుట, మనస్సుతో ఇతరులకు అపకారమును కోరుట, కఠోరవాక్యములచే ఇతరులను బాధించుట ఇవి అన్నియును హింసాలక్షణములు. తమహితమును కోరువారు ధర్మము ఇచ్చు ఈ ఆజ్ఞలను అతిక్రమించరాదు.

## సత్యము.

యస్త్వాదుష్టేన్ద్రియైర్దృష్టం శ్రుతం వేదవిదాం వర,
తస్యైవోక్తిర్భవేద్విప్ర సత్యతా నాన్యథా భవేత్॥

"దోషములు లేనట్టి ఇంద్రియములతో చూడబడినది, వినబడినది ఏది కలదో దానిని పలుకుట సత్యము. సత్యము అనునది మరియొకటి లేదు."

తాను సత్యము పలికినచో నిర్దోషి వధించబడు సమయమున సత్యము పలుకవలెనా? పలుకరాదా? అను విషయమున ఇట్లు చెప్పబడినది.

ఉక్తేఽనృతే భవేద్యత్ర ప్రాణినాం ప్రాణరక్షణమ్,
అనృతం తత్ర సత్యం స్యాత్, సత్యమప్యనృతం భవేత్॥

"అసత్యము పలుకుటచే ప్రాణులు రక్షించబడుచో ఆప్రసంగమున అసత్యము సత్యమగును. అచ్చట సత్యము అసత్యమగును."

ఒక కసాయి ఒక ఆవును తరుముచుండెను. ఆమార్గము ముందుముందు రెండుశాఖలుగా విడిపోయెను. కసాయి కొంచెము వెనుకబడెను: ఆవు ఏ దిక్కునకు వెళ్లినదియు అతనికి తెలియలేదు. అక్కడనే ఒక సాధువు చెట్టుక్రింద కూర్చొనియుండెను. కసాయి సాధువును ప్రశ్నించెను.

"ఓసాధూ! ఇక్కడనుండి వెళ్లిన ఆవు ఏదిక్కునకు వెళ్లినది?" సాధువు చెప్పెను. "చూచినవాడు మాట్లాడుట లేదు, మాట్లాడువాడు చూడలేదు. రెంటిని కలుపువాడు గురుచరణములయందు నిమగ్నుడై యున్నాడు."

కసాయి ఇతడెవరో పిచ్చివాడనుకొనెను. ఆతడు అక్కడినుండి వెళ్ళిపోయెను. సాధువు నిజమే చెప్పెను. "చూచినవాడు మాట్లాడుటలేదు." అనగా కన్ను చూచినది. అది మాట్లాడలేదు;

"మాట్లాడువాడు చూడలేదు." అనగా నాలుక మాట్లాడుచున్నది. అది చూడలేదు. "ఇరువురును కలుపువాడు గురుచరణములయందు నిమగ్నుడై యున్నాడు." అనగా బుద్ధి నేత్రములద్వారా చూచును, జిహ్వాద్వారా మాట్లాడును. అది గురుచరణములయందు నిమగ్నమయి ఉన్నది. కాని ఆ కసాయి తెలిసికొనలేకపోయెను. ఆసాధువు మతిభ్రష్టుడనుకొని వెళ్ళిపోయెను. ఆవు ప్రాణమును రక్షించుటకు సాధువు అట్లు చెప్పెను.

ఈవిషయమున మరియొక దృష్టాంతముకూడ వినదగును.

"దుర్యోధనుడు గదాప్రహారముచే మరణాసన్నుడై యుండెను. అతడు ఎంతయో బాధపడుచుండెను. కాని ప్రాణములు పోవుట లేదు. అంత అశ్వత్థామ అడిగెను. "ఓదుర్యోధనా, నీప్రాణము ఏల పోవుటలేదు?" దుర్యోధనుడు సమాధానము చెప్పెను. "నావద్దకు ఎవడైన పాండవుల శిరస్సులు తెచ్చినచో నాప్రాణములు పోవును." వీటైన తీసికొని వచ్చెదనని అశ్వత్థామ చెప్పెను. ఈసంగతి కృష్ణ పరమాత్మకు తెలిసి పాండవులను రక్షించుటకు ఉపాయము పన్నెను. వారిని దూర్వాసుని ఆశ్రమమునకు తీసికొనివెళ్లి "అశ్వత్థామ వీరిని చంపుటకు వచ్చినప్పుడు రక్షించవలె" నని చెప్పెను. దుర్వాసుడు ఇట్లు పలికెను. "అదెట్లు జరుగును? నేను అసత్యము పలుకనుకదా! అశ్వత్థామ పాండవులనుగురించి అడిగిన ఉన్నారనియే నేను చెప్ప వలెనుకదా!" కృష్ణపరమాత్ముడు పలికెను.

"మీకు ఉపాయము చెప్పెదను" అని దుర్వాసుడు కూర్చొనినచోట ఒక కందకము త్రవ్వించి అందు పాండవులను దాచెను. పైన బల్లలువేసి వానిపై దూర్వాసుని ఆసనమును ఏర్పాటుచేసెను. అనంతరము అశ్వత్థామ పాండవులను వెదకుచు దూర్వాసునివద్దకు వచ్చి "స్వామీ! తమరు పాండవులసంగతి ఎరుగుదురా?" అని

ప్రశ్నించెను. దూర్వాసమహాముని కృష్ణపరమాత్ముడు పన్నిన ప్రకారము ఒకటిమారు క్రోధావిష్టుడయి తన ఆసనము క్రిందను వ్రేలుతో చూపించుచు, భయంకరశబ్దము చేయుచు పలికెను. "క్రింద ఉన్నారు" ఇది విని అశ్వత్థామ ఇట్లనెను.

"స్వామీ! నేను స్వాభావికముగ తమను అడుగుచున్నాను. దానికి ఇంత క్రోధము ఎందుకు?" అని చెప్పి అశ్వత్థామ అచ్చటి నుండి వెళ్లిపోయెను.

ఈవిధముగా అనేకసమయములయందు అసత్యముకూడ పలుకవలసి వచ్చును. ఉపాయములనుకూడపన్నవలసివచ్చును. అయినను మిథ్యాభాషిత్వదోషము కలుగదు.

## శౌచము.

*అద్భిర్గాత్రాణి శుధ్యన్తి మనః సత్యేన శుధ్యతి।*
*విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిః జ్ఞానేన శుధ్యతి॥* (మను)

"పరిశుద్ధమగు జలముతో శరీరము శుద్ధిని పొందును. సత్యముచే మనస్సు శుద్ధిని పొందును. విద్యాతపములచే అంతఃకరణము శుద్ధిని పొందును. జ్ఞానముచే బుద్ధి పరిశుద్ధమగును."

*క్షాన్త్యా శుధ్యన్తి విద్వాంసో దానేనాऽకార్యకారిణః।*
*ప్రచ్ఛన్నపాపా జాప్యేన తపసా వేదవిత్తమాః॥* (మను)

"విద్వాంసులు ఓర్పుచేతను, దుర్మార్గులు దానముచేతను, ప్రచ్ఛన్నముగా పాపములు చేయువారు జపముచేతను, వేదమును తెలిసికొనినవారు తపస్సుచేతను శుద్ధిని పొందెదరు."

*క్షాన్త్యా శుధ్యన్తి విద్వాంసః*

ఓర్పుకలవాడు స్వర్గమును, కీర్తిని, మోక్షమును పొందును. ఆతడు పుణ్యక్షేత్రముతో సమానుడు. వాడు మానవుల పాపములను పోగొట్టి పవిత్రము చేయును. జగమునందలి పాపములన్నిటి

వశపరచుకొను వస్తువు "ఓర్పు." భూమిమీద పడిననిప్పు జ్వలించదు. గడ్డిమీద పడినది జ్వలించును. అటులనే క్రోధముకలవాడు అతి సామాన్యవిషయములకుకూడ తొందరతో పోట్లాడుటకు తయారగును. అట్లు ఓర్పుకలవాడు తయారవడు. పైగా ఆతని మాటలతో క్రోధముకలవాని క్రోధము శాంతించును.

దానేనాஉకార్యకారిణః.

ఎవనికిని ఇతరుల సంపాదనలో అధికారము లేదు. ఎవడైన చేతికి తప్పుడుమార్గమున దొరికినదానిని సంపాదించి ఇతరులకు దానము చేసినచో ఆ దానమును తీసికొనినవాడుకూడ ఆపాపమును పొందును. కావున యోగ్యకర్మలను చేయుటద్వారా సంపాదించిన ధనమును దానముచేసిననే తానుచేసిన అకార్యముల నుండి శుద్ధిని పొందును అని చెప్పవలెను. దానమునకు శాస్త్రమునందు పైన చెప్పబడిన స్వర్గాదివిశేషఫలములు దుష్టమార్గమున సంపాదించిన ధనమును దానముచేయుటచే లభించవు. అట్టి స్వర్గాదిఫలములు పరిశుద్ధమగు సంపాదనముచే లభించిన ధనముతో చేసిన దానముతోనే సిద్ధించును.

ఇతరులకు దుఃఖము కలుగకుండ తనచేతితో శుద్ధమార్గమున సంపాదించబడిన ధనమును దానముచేయుట ఉత్తమము.

ప్రచ్ఛన్నపాపా జాప్యేన.

పాపనివృత్తిని కలిగించు కర్మము ప్రాయశ్చిత్తము అనబడును. అజ్ఞాతపాపము ప్రాయశ్చిత్తముచే కొంతవరకుమాత్రమే నివృత్తిని పొందును. ఈశ్లోకమునందలి ప్రచ్ఛన్నపాపమునకు అర్థము అజ్ఞాత పాపము అనియే చెప్పుకొనవలెను. కాలము, అగ్ని, మట్టి, వాయువు, మనస్సు, జ్ఞానము, జలము, పశ్చాత్తాపము, వ్రతము, జపము, ఉపవాసము– ఇవి అన్నియును శుద్ధికి సాధనములు.

మరణాశౌచము పదిరోజులు. ఇది కాలికశుద్ధి.

మట్టిపాత్ర అగ్నిలో కాల్చుటవలన శుద్ధిని పొందును. ఇది అగ్నిశుద్ధి. అశ్వమేధాదియజ్ఞములచే కలుగు శుద్ధి కర్మశుద్ధి.

ఆవు వాసనచూచినను, కీటకములు, తలవెంట్రుకలు, ఈగలు మొదలగువానిచే దూష్యములయిన ఆహారాదులపై శుద్ధికొరకు జలము, భస్మము మొదలగునవి విధించబడినవి. ఇది మృత్తికాశుద్ధి.

త్రోవలో నున్ననీటిని కుక్కలు మొదలగునవి స్పృశించుటచే కలుగు అపవిత్రత వాయువుచే పోవును. ఇది వాయుశుద్ధి.

మనశ్శుద్ధికి ఆధారము పరిశుద్ధములగు ఆలోచనలు. ఆత్మజ్ఞానము సర్వపాపములనుండియు పరిశుద్ధుడగుటకు సాధనము. తపము, కృచ్ఛ్రాదివ్రతములు, జలముకూడ శరీరశుద్ధికి సాధనములు. పశ్చాత్తాపము, నిరాహారముకూడ శుద్ధివిషయమున ప్రసిద్ధములే. తెలిసినవాడు వేదాభ్యాసము అను తపముచే పరిశుద్ధుడగును. అటులనే జపముచేకూడ మనస్సు పరిశుద్ధమగును.

## దయ

ఆత్మవత్సర్వభూతేషు కాయేన మనసా గిరా।
అనుకమ్పా దయా సైవ ప్రోక్తా వేదాన్తవాదిభిః॥

"మనస్సు, వాక్కు, శరీరము వీనిచే అన్నిప్రాణులయందును సహానుభూతిస్వభావమునే కలిగియుండుట అనుకంప. అదియే దయ అని వేదాంతులు చెప్పిరి."

తాను చెప్పినట్లు విను తనకుటుంబములోని వారియందును, మిత్రాదులయందును, తదితరులయందును అనుకంపాభావము కలిగియుండుటతో దయ పరిసమాప్తిని పొందదు. ప్రతికూలురయందుకూడ దయ కలిగియుండుటతో దయ పరిపూర్ణమగును.

ఈ విషయముననే చెప్పబడినది.

*పరే వా బన్ధువర్గే వా మిత్రే ద్వేష్టరి వా సదా।*
*ఆపన్నే రక్షితవ్యం తు దయైషా పరికీర్తితా॥*

"బంధువులైనను కాకపోయినను, మిత్రులైనను శత్రువులైనను ఎల్లకాలములయందును ఆపదలనుండి రక్షించవలెను. అదియే దయ."

తనయందు మైత్రి కలిగియుండి, తనకు అనుకూలముగా ప్రవర్తించువారియందు దయతో నుండుటలో క్రొత్త ఏమియును లేదు. కాని తనయందు శత్రుత్వమును వహించువారు కష్టములు పడుచున్నప్పుడు వారియందలి శత్రుత్వమును విడనాడి "*ఏకో దేవః సర్వభూతేషు గూఢః*" "ఒకే దేవుడు అన్నిభూతములయందును నిండియున్నాడు" అను శ్రుతివాక్యమును జ్ఞాపకము తెచ్చుకొని శరీరముతోను, మనస్సుతోను, ధనముతోను వారిని కష్టములనుండి తప్పించుటకు ప్రయత్నించుటలో వారి దయ పరాకాష్ఠ నందుచున్నది. సత్సంగము, శాస్త్రాదుల పరిజ్ఞానము ఆవిషయమున సార్థకమగుచున్నవి.

ఇట్టి భూతదయ కలిగియుండుట మానవుని పరమకర్తవ్యము. అదియే శ్రేష్ఠమగు ధర్మమని శాస్త్రములుకూడ ఘోషించుచున్నవి.

*ధర్మో జీవదయాతుల్యో న క్వాఽపి జగతీతలే।*
*తస్మాత్సర్వప్రయత్నేన కార్యా జీవదయా నృభిః॥*

"ఈజగమున భూతదయకు సాటియగు వేరొండు ధర్మము లేదు. కావున అన్నివిధములుగను మానవుడు భూతదయను కలిగియుండవలెను." ఈవిషయమున రంతిదేవుడు, శిబి, జీమూతవాహనుడు మొదలగు మహాత్ముల దృష్టాంతములు ప్రసిద్ధములు.

## ఆస్తికత్వము.

"పరమాత్మని అస్తిత్వము, వేదములు మొదలగునవి ఈశ్వరప్రణీతములు, స్వర్గనరకములు, బంధమోక్షాదులు, పునర్జన్మము

మొదలగునవి వేదమునందు చెప్పబడినవి అన్నియును నిజము” అని అంగీకరించుట ఆస్తికత్వము.

నేటి కాలేజీవిద్యార్థులలో చాలమంది నాస్తికులగు చున్నారు. పరమాత్మని అస్తిత్వము, వేదములు ఈశ్వరప్రణీతము లను సంగతి, పునర్జన్మము మొదలగునవి వారు అంగీకరించరు. విజ్ఞానశాస్త్రము ద్వారా ఇవి అన్నియును ఋజువుచేయబడవు అని చెప్పెదరు. కావున వారియందు ఆస్తికత్వబుద్ధి లేదని చెప్పవచ్చును.

ఆస్తికత్వాభావముచే వారియందు అహింస, సత్యము, శౌచము మొదలగు గుణములుకూడ ఉండవు. ఏలనన హింసాది దుష్కర్మములకు ప్రతిఫలము కలుగును అనునది వారు అంగీకరించరు. అందుచే మీరు ఆస్తికత్వబుద్ధిని కలిగియుండుట నేర్చుకొనవలెను. ఆస్తికత్వము సదాచారముయొక్క ముఖ్యలక్షణము.

స్వా. ప్ర. :— సదాచారముతోపాటు సత్సాంగత్యముకూడ కలిగియుండవలెను. సంగతిదోషముచే మంచికుటుంబముల పిల్లలు కూడ కాలేజీలలో అనేకరకములగు దురాచారములకు పాల్పడు చున్నారు. అవి వారి భావిజీవితములయందలి అనేకదుఃఖములకు కారణములగుచున్నవి.

ప్రొ. జోషీ:— తమరు చెప్పినది యథార్థము. ఈబ్రాహ్మణ కుమారులు మంచి ఇంటివారైనను దుష్టసాంగత్యముచే బీడీలు మొద లగునవి కాల్చుచుండెడివారు. నేను చెప్పినందున వీరు ఆ అలవాట్లను తగ్గించిరి. కాని ఇంకా నీచస్నేహితుల స్నేహమును విడనాడుటలేదు.

## సత్సాంగత్యము.

స్వా. ప్ర. :—మోహజాలస్య యోనిర్హి మూఢైరేవ సమాగమః।
అహన్యహని ధర్మస్య యోనిః సాధుసమాగమః॥

“మూర్ఖసమాగమము మోహమునకు ఉత్పత్తిస్థానము. సాధు

పురుషసాంగత్యము ధర్మకారణము. అసాధువుల సాంగత్యముచే మోహము ఉద్భవించును. సాధువుల సాంగత్యముచే ధర్మభావము వృద్ధిని పొందును. సాధుసమాగమము ఔన్నత్యమును కలుగజేయును. అసాధువుల సాంగత్యము అధఃపతనమునకు మార్గము. సాధుసమాగమముచే సదాచారములు అలవాటు అగును. అసాధువుల సాంగత్యముచే దురాచారములు చేయును. దానికి పరిణామము దేవునకు దూరమగుట. అసాధువుల వాక్యములు ధర్మబంధమునందు శైథిల్యమును కలిగించును. అంతే కాదు. అసాధుసాంగత్యముచే నింద్యకర్మలను చేయుట, ధర్మమునందు అశ్రద్ధ మొదలగునవి ఉద్భవించును. కావున ఎల్లరును సత్పురుషుల సమాగమమును కోరవలెను. అసాధుసాంగత్యము నీచభావములను, నీచకామనలను వృద్ధినొందించును. కావున ఎల్లరును సత్సంగముచే తమను రక్షించుకొనవలెను. ఈవిషయమున ఇంకను చెప్పబడినది.

## పశ్చాత్తాపమునకు కారణములు.

వస్తునిఃశ్రేయసం వాక్యం మోహాన్న ప్రతిపద్యతే,
స దీర్ఘసూత్రీ హీనార్థః పశ్చాత్తాపేన యుజ్యతే॥

"శ్రేయస్కరమగు వాక్యమును మోహముచే నమ్మనినరుడు సోమరి, పురుషార్థహీనుడు. అతడు తరువాత పశ్చాత్తాపమును పొందవలసి వచ్చును." సత్పురుషుని ముఖమునుండి వెలువడిన వాక్యము కల్యాణకరమగును. కావున వెంటనే దానిని అనుసరించవలెను. అహంకారముతో దానిని తిరస్కరించరాదు. చేయవలసిన దేదియో వెంటనే చేయవలెను. సోమరితనముతోను, మందబుద్ధితోను సమయమును వ్యర్థము చేయరాదు. హితవాక్యతిరస్కారము, చేయదగిన సత్కార్యములయందు దీర్ఘసూత్రిత్వము- ఈ రెండును పశ్చాత్తాపకారణములు.

*సతాం మతమతిక్రమ్య యోఽసతాం వర్తతే మతే,*
*శోచన్తే వ్యసనే తస్య సుహృదో న చిరాదివ॥*

"సత్పురుషుల అభిప్రాయములను ఉల్లంఘించి అసత్పురుషుల అభిప్రాయముల ప్రకారము సంచరించువాని మిత్రులు అచిరకాలములో ఆతనికి కలుగు ఆపదలను చూచి దుఃఖించెదరు."

ఒక రాజధానిలో ఒక నగరశ్రేష్ఠి ఉండెను. అతనికి ఒక కుమారుడు ఉండెను. కొంతకాలమైన తరువాత నగరశ్రేష్ఠి చనిపోవుటచే కుమారుడు నీచులగు స్నేహితుల సాంగత్యమును పట్టెను. తండ్రి స్నేహితులు అతనికి దుష్టుల సహవాసము మానమని ఎంత చెప్పినను వినలేదు. పర్యవసానరూపముగా అతడు ఒకగొప్ప అపరాధముచేసి తనస్నేహితులతోబాటు పట్టుబడి న్యాయాధీశుని ఎదుట నిలబెట్టబడెను. న్యాయాధిపతి నీచపు దోషులను గాడిదపై కూర్చుండపెట్టి నగరమంతయు ఊరేగించమని విధించెను. పిదప నగరశ్రేష్ఠి కుమారుని ఇట్లు ప్రశ్నించెను. "నీవు ఎవరి కుమారుడవో, నీవంశము ఎట్టిదో తెలుసునా? నీవు ఇంత నీచపు పని ఏల చేసితివి? వెళ్లు, నా ఎదుటనుండి వెళ్ళిపొమ్ము. నీముఖము చూడను"అని అతనిని చీవాట్లు పెట్టి బైటకు పంపించెను. న్యాయాధికారి విధించిన శిక్షను జనులు విమర్శించిరి. "న్యాయాధికారి శిక్ష విధించుటలో పక్షపాతమును చూపించెను. ఒకే నేరమునకు బీదవాళ్ళపిల్లలను గాడిదపై కూర్చుండబెట్టి ఊరంతయు త్రిప్పించెను. నగరశ్రేష్ఠికుమారునకు చీవాట్లు మాత్రమే పెట్టెను. బీదవారిని కఠినముగా శిక్షించెను." ఆరోజు సాయంకాలము మిగిలిన దోషులు గాడిదపై కూర్చొని ఊరేగిరి. వారి వెనుక పిల్లలు తప్పట్లు కొట్టుచు వెంబడించిరి. ఈవిధముగా నగరప్రదక్షిణము పూర్తి అయినపిమ్మట వారు విడిచిపెట్టబడిరి.

కాని వారికి తమదుష్కృత్యముచే ఏమాత్రమును గ్లాని కలుగ లేదు. ఇంటికి వెళ్ళి ఆనందముతో తిని పండుకొనిరి. కాని నగరశ్రేష్ఠి కుమారుని న్యాయాధికారిశబ్దములు చాల బాధించుచుండెను. ఇక ప్రపంచమునకు తనముఖము చూపించుట ఎట్లు అని ఆతడు దుఃఖించు చుండెను. ఈదుఃఖముతో ఆతడు ఎంతయో వికలుడయి విషము తిని మరణించెను. దీనివలన ఆతని మిత్రులు చాలదుఃఖించవలసి వచ్చెను. కావున మీ అందరకును జోషీగారు దివ్యమూర్తి. వారి ఆజ్ఞలను ఉల్లంఘించుట మహాపాపము అని మీఅందరకును చెప్పుచున్నాను.

అనంతరము పెద్దవిద్యార్థి చెప్పెను. మా ఈమిత్రుడు జోషీ గారు చెప్పినందున బీడీత్రాగుట ఈమధ్యనే మానివేసెను. కాని కుసాంగత్యముచే ఇతడు పాడయిపోయి మాట్లాడుచు, మాట్లాడుచు చిన్నచిన్న విషయములకుకూడా కోపించి అనవసరముగా పోట్లాడు చుండును.

స్వా. ప్ర. :—ఎల్లప్పుడు ఒకవిషయము మాత్రము జ్ఞాపకము ఉంచుకోండి. మానవుడు తన స్వభావమును మంచిగా నుంచుకొన వలెను. అనేక గుణములున్నను స్వభావము తప్పుగానున్నచో గుణ ములు కప్పబడి పోవును. మీదగ్గర మరిఏమి లేకపోయినను, సత్స్వ భావము ఉన్నచో అందరకును ఆనందము కలుగును.

ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి.

స్వభావేన హి తుష్యన్తి దేవాః సత్పురుషాః పితా ।
జ్ఞాతయస్త్వన్నదానేన వాక్ప్రదానేన పణ్డితాః॥

"దేవతలు, సత్పురుషులు, తండ్రి స్వభావముచేతనే సంతో షమును పొందెదరు. జ్ఞాతులు అన్నపానములచేతను, పండితులు వాక్కును సదుపయోగము చేయుటచేతను సంతృప్తిని పొందెదరు."

స్వభావమునుగురించి పారసభాగము ఇట్లు చెప్పుచున్నది.

## జీవస్వభావము.

ఈశరీరములో ఎన్నిరకములగు స్వభావములు కానవచ్చునో వాని అన్నిటికిని జీవునితో సంబంధము కలదు. అయినను కొన్ని స్వభావములు శుభకరములు. కొన్ని అశుభకరములు. శుభస్వభావములద్వారా జీవుడు ఉత్తమదశను పొందును. అశుభస్వభావముచే అధఃపతనము నొందును. స్వభావములు అనంతములు. అయినను వానిని నాలుగు రకములుగా విభజించవచ్చును.

1. పశు, 2. సింహ, 3. ప్రేత, 4. దేవతాస్వభావములు.

1. విషయభోగములయందు అభిలాషగలిగి ప్రబలమగు తృష్ణకలిగి కామాదికములకు వలయు సాధనములనుమాత్రమే సంపాదించుటయందు నిమగ్నుడయినవాడు పశుస్వభావుడు.

2. క్రోధస్వభావముకలిగి మనోవాక్కాయములచే ఈర్ష్యను పొంది దుర్వచనములు వలుకుచు ప్రాణులను హింసించువారు సింహస్వభావులు.

3. కపటము, మోసము, దంభము మొదలగువానిద్వారా ఇతరులను మోసగించువారును, వారికి దుఃఖములు కలుగజేసి ఉపాధులను పెంచువారును ప్రేతస్వభావులు.

4. బుద్ధిచే విద్య, ఉపకారము, వైరాగ్యము మొదలగు దివ్యకార్యములయందు నిమగ్నులయి, నింద్యకార్యము లన్నిటిని విసర్జించి, సర్వజీవులకును సుఖమును కోరువారు, శుభకార్యములయందే ప్రసన్నులయి ఉండెడివారును, జడత్వము, మూర్ఖత్వము విఘ్నములుగా తలచువారును దేవతాస్వభావులు.

కుక్క అపవిత్రమయినదిగా చెప్పబడినది. దాని శరీరము అపవిత్రమని కాదు. స్వభావమే అపవిత్రము. ఏలనన అది క్రోధముచ

ఇతరప్రాణులను చీల్చివేయును. అందుచేతనే అది అపవిత్రము. అటులనే పందియందుకూడ శరీరమునకు సంబంధించిన అపవిత్రత లేదు. అపవిత్రపదార్థములను కోరుటయే దాని అపవిత్రత. అటులనే ప్రేతములు, దేవతలు మొదలగువాని అపవిత్రత,పవిత్రత అన్నియు స్వభావమునకు సంబంధించినవే.

సంతులును, శాస్త్రములును మనుష్యునకు ఇట్లు ఉపదేశించుచున్నవి. బుద్ధి అనెడు నేత్రముల ప్రకాశముద్వారా మనస్సు అనెడు భూతము చేయు కపటములను గమనించవలెను. వానిని గమనించిన తోడనే చిత్తమునుండి వానిని తొలగించవలెను. అందుచే వానివలన కలుగు విఘ్నములనుండియు, కపటములనుండియు మానవుడు రక్షించబడును.

శంకరాచార్యులవారు చెప్పిరి. మానవులందరియందును భూతస్వభావము ప్రత్యక్షముగా గోచరించుచున్నట్లుగనే నాయందును కలదు. కాని భగవానుడు దానిపై నాకు బలమును ప్రసాదించెను. వాటి విఘ్నములు నాదరిజేరవు. అదేవిధముగ వారు సంతులకు ఇట్లు ప్రబోధించిరి. తృష్ణ అనెడు పందని, క్రోధము అనెడు కుక్కను వశపరచుకొని బుద్ధిని అనుసరించి ప్రవర్తించినచో, మానవుని స్వభావము అంతయు పరిశుద్ధమగును. ఆస్వభావము అతని పుణ్యమునకు బీజము అగును.

మనుష్యుడు చెడుస్వభావమునకు వశీభూతుడయి ప్రవర్తించినచో అతని స్వభావము అంతయును చెడ్డది అయిపోవును. ఈ అశుభస్వభావమే మానవుని భాగ్యహీనతకు బీజమగును.

జీవునకు జాగ్రత్, స్వప్నావస్థలయందు తానెట్టి విధముగనున్నాడో స్పష్టముగా తెలిసినచో నేను భూతమునకును, కుక్కకును

లోబడియున్నాను, వాని ఆజ్ఞప్రకారము సంచరించుచున్నానని తెలిసికొనగలడు.

ఎవనినైన ధర్మాత్ముని అధర్మముగా తామసముకల మనుష్యుడెవడైన జైలులో ఉంచినచో ఆధర్మాత్మునకు ఎంతయో దుఃఖము కలుగును. అటులనే దేవతాస్వభావముకలవాడెవడైన శునకస్వభావముకల దైత్యబంధమున పడినచో ఆతడుకూడ నీచత్వ మును పొందును.

అటులనే యథార్థముగు నైతికదృక్పథముతో ఆలోచించి నచో నేను రాత్రింబవళ్ళు నావాసనకు అధీనుడనై యున్నాను. చూచుటకు మాత్రము మనుష్యశరీరము ఉన్నను స్వభావము చేతను కుక్కను పందిని భూతమును పోలియున్నాను అవి తెలిసికొన గలడు. కాని పరలోకమునుగురించిమాత్రము మరియొకవిధముగా చెప్పెదరు. అక్కడ స్వభావమును అనుసరించియే శరీరము లభిం చును. కావున తృష్ణ అధికముగానున్న మనుష్యుడు పంది శరీర మును పొందును.

ఎవడైన తన స్వప్నమునందు కుక్కనుకాని, సింహమును కాని చూచినచో ఆవ్యక్తిస్వభావము అపవిత్రమైనదని తెలిసికొనవలెను. ఏలనన స్వప్నములు పరలోకమును తెలుపును. స్వప్నములయందు మానవుడు ఇంద్రియప్రదేశమునకు అతీతుడగును. అందుచే ఆస్థితిలో జీవునకు తన స్వభావము ననుసరించియే స్వరూపము కన్పించును. మనస్సునందున్న స్వరూపమే ప్రత్యక్షముగ కన్పించును.

ఈవిషయమున వివరించినచో ఇంక చాలగ్రంథము అగును. కావున ఈవిషయము ఇక్కడే విడచుచున్నాను.

ఈ నాలుగు స్వభావములును అంతఃకరణమును ఆధారముగా చేసికొని చెప్పబడినవి. కావున తన నడవడికనుగుఱించి ఆలోచించి

నేను ఈనాలుగింటిలోను దేనికి చెందినవాడను అను విషయమును గురించి ఆలోచించి నిశ్చయమునకు రావలెను. ఎట్టిపని మనము చేయుచున్నామో అట్టిస్వభావము మనహృదయమున స్థిరపడును. అదియే పరలోకమున మనతో నుండునది.

స్వభావము లన్నిటికిని మూలము ఈ నాలుగు స్వభావములే. తృష్ణ అను పందియొక్క ఆజ్ఞప్రకారము నడచినవాని హృదయమున అపవిత్రత, లజ్జాహీనత, లంపటత్వము అను గుణములు ఉండును.

తృష్ణ అనెడు పందిని తన వశమునందు ఉంచుకొనినచో సంయమము, సౌశీల్యము, గాంభీర్యము, నిర్లోభము, నిష్కామము, తృష్ణాభావము మొదలగు సద్గుణములు కలుగును.

క్రోధము అనెడు కుక్కకు మానవుడు లొంగిపోయినచో కుటిలత్వము, జంకులేక పోవుట, ఆత్మస్తుతి, డాంబికము, దుర్వచనములు పలుకుట, పదవివ్యామోహము, ఇతరజీవులను తమకంటె తక్కువగా చూచుట, ఇతరులను దుఃఖింపజేయుట మొదలగు అనేక దుర్గుణములు ఉద్భవించును. ఆకుక్కను లొంగదీసికొనినచో ధైర్యము, సహనము, ఓర్పు, శాంతి, పరాక్రమము, దయ మొదలగు సుగుణములు ఉద్భవించును.

భూతప్రేతముల ఆజ్ఞలను మానవుడు అనుసరించినచో ఆవిధముగనే ప్రవర్తించును. వారిహృదయములయందు మాలిన్యము, రోగము, కపటము, చింత, ఛలము, పాఖండము మొదలగు చెడుస్వభావములు ఉద్భవించును. ఆస్వభావమును వశపరచుకొనినచో వానికి లోబడడు. వాడు మనస్సును జయించును. అతనికి వివేకము, జ్ఞానము, విద్య, అనుభవము, పరోపకారము, శ్రద్ధ, మొదలగు గుణములు పెరుగును.

సత్స్వభావము మానవునియందు పెరిగిన అవి వానితో సర్వకాలసర్వావస్థలయందును ఉండును. అవి మానవుని పరమభాగ్యమునకు నశించని బీజములు. అశుభస్వభావములచే హృదయము అపవిత్రమగును. అదియే పాపము.

మానవుడు చెడుపని చేసినను, మంచిపని చేసినను అది మానవుని విడనాడదు. మానవుని హృదయము దర్పణమువలె శుభ్రమయినది. ఆతడు చేయుపాపములు తుప్పువంటివి. ఆహృదయము భగవానుని రాజ్యమునకు వెళ్ళలేదు.

సత్స్వభావముకల మానవుడు ప్రకాశరూపుడు. ఆప్రకాశముచే హృదయదర్పణముయొక్క అవిద్య అనెడు అంధకారము పోవును.

శంకరాచార్యులవారు చెప్పిరి.

మానవుడు చెడుపని చేసినతరువాత వెంటనే మంచిపని చేసినచో దుష్కృత్యముచే వచ్చిన హృదయమాలిన్యము పోవును. పరలోకమునందు ఎవరిహృదయము ఎట్లుఉన్న అటులనే ప్రకటమగును. నిర్మలహృదయము అక్కడ అటులనే కాననగును.

"పరిశుద్ధాత్ములు నామార్గమున నడచెదరు" అని భగవానుడు చెప్పెను. మానవుని హృదయాదులు ఉత్పత్తికాలమున లోహఫలకమువలె మొద్దుగా నుండును. విధివిహితముగ సంస్కరించుట చేతనే అవి నునుపెక్కి సర్వపదార్థములను ప్రదర్శించును. అట్లు మర్దనసంస్కారముచే వానిని ప్రకాశవంతముగ చేయనిచో అవిమాలిన్యమును పొందును. వానియందు నిర్మలత్వము ఉండదు. అవి ఏవిషయమును చూపించలేవు.

భగవానుడు చెప్పెను. "ఇందు సందేహము లేదు. నేను నీహృదయమును చూచుదును. నీవు ఏమి చేయుచున్నను నీహృదయమునే చూచుచున్నాను."

స్వామివారు మీకు బ్రహ్మచర్యాశ్రమమున పూర్తిగా నిత్య కర్మలను ఆచరించమని చెప్పిరి. అనంతరము పారసభాగమున చెప్ప బడిన జీవస్వభావమునుగురించి కూడ మీకు తెలిపితిమి. ఈప్రకార ముగా మీరు బ్రహ్మచర్యాశ్రమమును గడపినచో అది మీకు చాలును.

అనంతరము ఉదయశంకరభాయి పలికిరి.

వీరికి బ్రహ్మచర్యాశ్రమమునుగురించి చెప్పిరి. అటులనే మాకును గృహస్థాశ్రమమునుగురించి చెప్పినచో ఎంతయో ఉపకార మగును. ఇవి అన్నియు మేము తెలిసికొనవలసినవే. ఇంతలో భోజన మునకు పిలుపు వచ్చెను. స్వామివారు భోజనానంతరము ఆవిషయ ములు వివరించెదమని చెప్పిరి. అందరు భోజనములకు లేచిరి.